# సమాజరూప సర్వేశ్వరుని సేవించండి!

వేదశాస్త్రములు వివరించి బుధులచే
చదివించవచ్చు తా చదువవచ్చు
యజ్ఞయాగ తపము లధికార జనులచే
చేయించవచ్చు తా చేయవచ్చు
ఇలలోనగల తీర్థములకేగ నన్యులకు
బోధించవచ్చు తా పోవవచ్చు
అష్టాంగయోగంబు నర్థులకు బోధ
సలుపంగవచ్చు తా సలుపవచ్చు
కాని తమ మనో బుద్ధ్యహంకారములను
నిల్పి అంతర్ముఖముచేసి అనవరతము
నిశ్చల సమాధి నిష్టలై నిలువలేరు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

దివ్యాత్మ స్వరూపులారా!

'జ్ఞానానాం ఆత్మజ్ఞాన ముత్తమమ్'. జ్ఞానములన్నింటికంటెను ఆత్మజ్ఞానము ఉత్తమమైనది. ఈ ప్రపంచములో భౌతిక జ్ఞానము, వైజ్ఞానిక జ్ఞానము, సంగీత జ్ఞానము, సాహిత్య జ్ఞానము, నృత్య జ్ఞానము, చిత్ర జ్ఞానము, శిల్ప జ్ఞానము యింకా ఎన్నియో భౌతిక జ్ఞానములు కన్పించుచున్నవి. ప్రాకృతమైన జ్ఞానములు యెన్ని సంపాయించుకున్నప్పటికిని ఆధ్యాత్మిక జ్ఞానమనేది, ఆత్మ జ్ఞానమనేది ఒక్కటి లేకుండిన యివన్నియుకూడను శాంతిసుఖములను కూర్చలేవు. ప్రాపంచికముగా కీర్తి ప్రతిష్టలను అందుకొని వుండవచ్చు. ఉన్నత పదవుల నేలవచ్చు. కానీ, ఆత్మానందము లభించవలెనన్న ఒక్క ఆత్మజ్ఞానమే అవసరము. అది లేకుండిన 'నహినహిరక్షతి డుకృఞ్‌కరణే', యిది యేమాత్రముకూడను మానవుని రక్షించలేదు. ఏ జ్ఞానము అనేకత్వములోని యేకత్వమును, మృత్యువులోని

srisathyasaivachanamrutam

అమృతతత్వమును చూపించునో అట్టి జ్ఞానమే ఆత్మజ్ఞానము. ఇట్టి యేకత్వమును గుర్తించిన వ్యక్తిని మాత్రమే సర్వజ్ఞుడని చెప్పవచ్చును. ఇలాంటి సర్వజ్ఞతను సాధించటానికి ఆత్మజ్ఞానము ఒక్కటే రాజమార్గము. లోకములో అనేక విద్యలను అభ్యసించవచ్చును. పండితుడని పేరు ప్రఖ్యాతులు పొందవచ్చును. గొప్ప కళాకారుడు కావచ్చును. కానీ ఆత్మజ్ఞానమే లేకుండిన యివన్నియుకూడను నిరుపయోగములవుతాయి. 'తరతి శోక మాత్మవిత్' అన్నది, ఉపనిషత్. అనగా శోకమును నివారణగావించునది, నిర్మూలము గావించునది ఒక్క ఆత్మజ్ఞానమే! శోకమును నివృత్తి గావించలేని శ్లోకములు ఎన్ని చదివినప్పటికిని యివి కాలమును, జీవితమునుకూడను నిరర్థకము గావించును. ఈ ప్రాపంచిక విద్యలన్నియుకూడను, యీ ప్రాపంచిక జ్ఞానమంతయుకూడను జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవి.

**ఆత్మజ్ఞానము చిత్తశుద్ధి కలిగినవారికే లభ్యమవుతుంది**

సమస్త జ్ఞానమునకును మూలాధారమై, సమస్త కళలకును నిధియైన దైవత్వాన్ని పొందినప్పుడు సమస్త విద్యలు తనకు కరతలామలకమవుతాయి. సర్వశక్తి మయుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకత్వము వహించిన దైవత్వాన్ని పొందే ప్రయత్నమునకు మానవుడు ప్రయత్నించినప్పుడే యిది ఆత్మజ్ఞానమునకు అతిసమీపముగా వుంటుంది. ఇట్టి ఆత్మజ్ఞానము కేవలము చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులకు మాత్రమే లభ్యమవుతుంది. చిత్తశుద్ధి లభించే మార్గము ఏమిటి? పవిత్ర కర్మలను ఆచరించటము అత్యవసరము. యజ్ఞయాగాదిక్రతువులు, దానధర్మాది కర్మలు, తపశ్శక్తులు దీనికి సరైన మార్గములు. పవిత్రహృదయులను దర్శించటము, వారి చరిత్రలను పఠించటము యిత్యాది కర్మలద్వారాకూడను చిత్తశుద్ధి యేర్పడుతుంది. కనుక 'చిత్తస్యశుద్ధయే కర్మః' అన్నారు. ఈ సత్కర్మలచేతను, యీ పవిత్రమైన కర్మలచేతను చిత్తశుద్ధి యేర్పడుతుంది. ఈ చిత్తశుద్ధిద్వారా జ్ఞానశుద్ధి కలుగుతుంది. 'జ్ఞానాదేవతుకైవల్యమ్'. ఇదే మోక్షమునకు సులభ మార్గము. కనుక, సత్కార్యములు ఆచరించి, సత్సంగములో ప్రవేశించి, సద్భావములచేత సంఘసేవలో మనము పాల్గొనాలి. అయితే, యీ యజ్ఞయాగాది కర్మలకుగానీ, పవిత్రపఠనలకుగానీ విద్య అవసరము కదా! మనము ఎట్టి విద్యలు నేర్చకపోయినప్పటికి



srisathyasaivachanamrutam

యీ చదువులన్నియుకూడను మానవునియొక్క ఏకత్వమును భిన్నము గావించుచున్నవనే సత్యాన్ని గుర్తించటము అవసరము. గాఢమైన విశ్వాసము యీ యొక్క మార్గమునకు అత్యవసరము. నిన్ను నీవు నమ్ము, నమ్ము, నమ్ము. ఆ పైన భగవంతుని నమ్ము. ఇదే నిజమైన రాజమార్గము Faith in yourself and faith in GOD; this is the secret of greatness. ఈనాడు విశ్వాసము యేమాత్రము గాఢముగా కనుపించటము లేదు. స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై యేర్పడిన విశ్వాసమే అధికముగా కనుపించుచున్నది గానీ పరార్థమైనది, పరమాత్మ సంబంధమైనది, ఆత్మసంబంధమైన విశ్వాసము చాలా తక్కువగా వున్నది. ఈ విశ్వాసము తన పవిత్రతను కోల్పోవటంచేతనే మానవుడు యెన్ని విధములైన సాధనలు చేసినప్పటికిని, ఎన్నివిధములైన జ్ఞానములు ఆర్జించినప్పటికిని అవి కేవలము నిరుపయోగములుగా రూపొందుతున్నవి. 'యోమద్భక్తః సమే ప్రియః' ఎవడు నాకు భక్తుడుగా వుండునో వాడే నాకు ప్రియుడు అన్నాడు కృష్ణ పరమాత్మ. అనన్య భక్తి అత్యవసరము. ఈ 'అనన్య భక్తి' అంటే ఏమిటి? ఎక్కడ పరిపూర్ణమైన ప్రేమయో అక్కడనే శ్రద్ధ. ఎక్కడ శ్రద్ధయో, 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అన్నట్లు అక్కడే జ్ఞానము. ఎక్కడ నిజమైన సాధనో అక్కడే సాధ్యము. సాధ్యమన్నను, పరమ భక్తి అన్ననూ, అనన్య భక్తి అన్ననూ, ఒక్కటే! ఆత్మ జ్ఞానమన్ననూ, పరమాత్మ జ్ఞానమన్ననూ, ఆధ్యాత్మ జ్ఞానమన్నను పేరులు వేరు వేరుగాని, గమ్యము ఒక్కటే! ఇవన్నియుకూడను పరతత్త్వమునకు పర్యాయపదములు. కనుక, యిట్టి భక్తులు కావలెనన్న లౌకిక విద్యలుగానీ యింకే విధమైన శక్తి సామర్థ్యములుగాని ఉపయోగపడవు. జాతి, మత, కుల, వర్ణ, లింగ భేదములతో దీనికి యేమాత్రము సంబంధములేదు.

**వాల్మీకి ఎవ్వని వంశమందలివాడు**
**నందుడు ఏ పల్లెయందుపుట్టె**
**ధర కుచేలుడు ఎంత ధనము కల్గియుండె**
**గజరాజు యే విద్య గల్గియుండె**
**వసుధ ధృవుడెంత వయసు కల్గియుండె**
**శబరి ఎంతటి శక్తి కల్గియుండె**

sri sathyasai vahinimrutam

**విదురుని కెంతటి వితరణ మతియుండె**
**తిమ్మని కెంత తెలివియుండె**
**భక్తి కల్గిన వారికి వశుడనయ్య**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పఱతు**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా!**

పాండిత్య ప్రభావము కాదు, దీనికి ఆధారము. దీనికి కావలసినది, నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన ప్రేమయే! కానీ యీనాడు స్వార్థము, అపవిత్రము, మాలిన్యమైన మనస్సుతో మాధవుని చింతించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మనస్సునకు భగవంతుడు ఏనాడు లభ్యముకాడు.

**అహంకార, ఆడంబరములకు భగవంతుడు లభ్యముకాడు**

'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్'. మానసికముగా, వాచకముగా, కాయకముగా భగవంతుని చింతించటానికి ప్రయత్నించాలి. ఈనాడు ఆచరణ వేరు. తలంపులు వేరు. కేవలము యీనాడు ఆడంబరమునకు ఆలవాలమై పోయింది, సాధన. అహంకార, ఆడంబరములకు భగవంతుడు లభ్యముకాడు. మనము ఆచరించే కర్మలు ఫలరహితమైనవిగా, స్వార్థరహితమైనవిగా, అహంకార రహితమైనవిగా రూపొందింప జేసుకోవాలి. దీపమును వెలిగించుటకు ఎవ్వరికైననూ అధికారముంటున్నది. పురుషుడు వెలిగించివచ్చును, స్త్రీ వెలిగించవచ్చును, వృద్ధుడు వెలిగించవచ్చును, యువకుడు వెలిగించవచ్చును. జ్ఞానజ్యోతిని వెలిగించుకొనుటకు సర్వులకు అధికారము వుంటున్నాది. వారి వారి శక్త్యానుసారము వారి సాధనలు పురస్కరించుకొని జ్ఞానము పొందటానికి తగిన ప్రయత్నము చేయవచ్చును. అయితే, సామాన్యముగా ప్రతిమానవునికికూడను విహిత కర్మలు వుంటున్నాయి. ఇందులో నైమిత్తిక కర్మ అని ఒకటి. రెండవది కామ్యకర్మ అని. నిషిద్ధకర్మ అని మూడవది. ప్రాయశ్చిత్తకర్మ అని నాల్గవది. ఈ నాలుగుకూడను ప్రతి మానవుడు తప్పనిసరిగా చేయవలసి వస్తుంది.

sri sathyasai vahanamrutam

## ప్రతి మానవుడు తప్పనిసరిగా చేయవలసిన కర్మలు

నిమిత్త మాత్రంగా ఏర్పడిన కర్మలంతా నైమిత్తిక కర్మలంటారు. ఇవి కొన్ని వ్రతములుగా వుండవచ్చును. కొన్ని నోములుగా వుండవచ్చును. కొన్ని కొన్ని నెలకొక పర్యాయము, మూడునెలలకొక పర్యాయము, సంవత్సరమునకొక పర్యాయము శ్రాద్ధములనేవి వస్తుంటాయి. ఇవికూడను నైమిత్తిక కర్మలలో చేరినవే. సూర్యగ్రహణము. చంద్రగ్రహణము ఏర్పడుతుంటాయి. అలాంటి సమయములో గ్రహముల శాంతి నిమిత్తమై చేసే కర్మలుకూడను నైమిత్తిక కర్మలే. ఇవి సామాన్యమైన మానవులు, సంసార జీవితము గడిపే మానవులు ఆచరించవలసిన నైమిత్తిక కర్మలు.

ఇంక కామ్యకర్మలు. అనగా సకాలమునకు వర్షములు కురవాలి. పంటలు పండాలి. దుర్భిక్షము పోవాలి. సుభిక్షము రావాలి. లోకమంతాకూడను శాంతిగా వుండాలి. తాను సర్వమును అనుభవించాలి. ఇహమునందు సుఖమును అనుభవించాలి అనే కోరికతో నిర్వర్తించే కర్మలు. అనగా యిహ, పర సుఖముల నిమిత్తము, లోక కళ్యాణ నిమిత్తము ఆచరించే కర్మలన్నీ కామ్యకర్మలే! 'లోకా స్సమస్తా స్సుఖినో భవంతు'. ఇది యుగయుగములనుండి, తరతరములనుండి హైందవజాతియొక్క సాంప్రదాయములో ప్రధానమైనది. ఈ విధమైన విశాల హృదయముచేతనే భారతీయ సంస్కృతి నాటినుండి నేటివరకు యే విధమైన లోటు లేకుండా జరుగుతూ వస్తుండాది. లోకమనగా యేమిటి? మనమున్న జీవితము. మన లోకమంటే ఏమిటి? దీనికి సాలోక్యము, సారూప్యము, సామీప్యము, సాయుజ్యము అని నాలుగు విధములైన తెగలు యేర్పడుతూ వచ్చాయి. సాలోక్యమనగా తాను యే విధమైన చింతనతో జీవిస్తున్నాడు, అనేది. ప్రపంచములో వుండిన కొండలు, గుట్టలు, నదులు, పట్టణములు యివన్నీ చేరినదికాదు, లోకము. 'మనోమూలమిదం జగత్' మనస్సే సర్వ లోకములకు మూలాధారము. ఈ మనో లోకమును స్వచ్ఛముగా, పవిత్రముగా, నిస్వార్థముగా వుంచుకున్నప్పుడు లోకమంతాకూడను పవిత్రముగా వుంటుంది. బయట ప్రపంచమునంతను మనము పచ్చగా చూడాలనుకుంటే ప్రపంచమునకంతా పచ్చని రంగును వేయనక్కరలేదు. మన దృష్టికి పచ్చని రంగు వేసుకుంటే జగత్తంతా పచ్చగానే కనుపిస్తుంది. కనుకనే దృష్టిని

sri sathyasai vachanamrutam

బట్టియే సృష్టి. మన నేత్రమునుబట్టియే శాస్త్రము వుంటున్నాది. మనలో వుండిన మనోభావములయొక్క లోకాన్ని మనము నిర్మలముగా వుంచుకొనుటకు ప్రయత్నించాలి. కనుక, పవిత్రమైన మనస్సుతో ప్రార్థనలు సలిపినప్పుడు పరమాత్మ మనలను అనుగ్రహించటానికి అవకాశము వుంటున్నాది. ఇందుకు ఆర్తితో ప్రార్థన చేయటము, ప్రధానమార్గము. అట్టి ప్రార్థనకు ఉపాంగములే యజ్ఞయాగాదిక్రతువులు. ఇది స్వార్థము, పరార్థము మరియు ఇహము పరము వీటిలో చేరి వుంటున్నాది.

**ఇహమును సుఖింప హేమతారక విద్య**
**పరమును సుఖింప బ్రహ్మవిద్య**

లౌకిక విద్యలన్నియుకూడను యిహలోకమునందు మాత్రమే ఆనందమును చేకూర్చును. బ్రహ్మ విద్య పరలోకమునకూడను ఆనందమును అందించటానికి వీలుగా వుంటుంది. కనుకనే కామ్యకర్మలనగా తనకు, తనలోకమునకు, తనవారలకుకూడను సుఖశాంతులను చేకూర్చే మార్గము అని. మనము నిత్యము ఆచరించే పూజలు, షోడశోపచారములు

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనం**

ఈ మార్గములన్నీకూడను కేవలము కామ్యకర్మలు మాత్రమే!

మూడవది నిషిద్ధకర్మ. మనము కొన్ని విడువవలసినవి వున్నాయి. ఆహారమును బట్టే మనయొక్క మనఃప్రభావము వుంటుండాది. కనుకనే సాత్త్విక ఆహారము అత్యవసరము. సాధకులు రజోగుణ, తమోగుణసంబంధమైన అహారములు పూర్తిగా వదలిపెట్టాలి. మద్యపానము, మాంసాహారము యిత్యాది మత్తు పదార్థములు అన్నియూ వదలిపెట్టాలి. ఎట్టి ఆహారమో అట్టి తలంపులు. ఎట్టి తలంపులో అట్టి మనస్సు. ఎట్టి మనస్సో అట్టి మనిషి. ఎట్టి మనిషో అట్టి ప్రవర్తన. ప్రవర్తన బట్టే మన సంస్కృతి ఆధారపడి వుంటుంది. నీతితోకూడిన ప్రవర్తన మనకు అత్యవసరము. నిజాయతీతోకూడిన వాక్కు మనకు అత్యవసరము. నీతి, నిజాయతీలే మానవునియొక్క నేత్రములు. ఈ నీతి, నిజాయతీలను మనము కోల్పోయిన తరువాత, మానవత్వమే వ్యర్థము. నిషిద్ధ కర్మలనగా మనము



srisathyasaivachanamrutam

త్యజించవలసిన కర్మలు. ఇవి ప్రత్యేకముగా కొన్ని వుంటున్నవి. ఆహార, విహారములందు పాటించవలసిన కొన్ని నియమములను మనము తెలుసుకోవాలి. ఎట్టి ప్రవర్తనలో నేను వుంటున్నాను అని తనకు తాను పరీక్షించుకోవాలి. నేను చెప్పిన మాటకు, తలచిన తలంపుకు నా ప్రవర్తన సరిగా వున్నదా లేదా అని చింతించాలి. నా మనసులోని తలంపు ఎవరికీ తెలియదు కదా అని నీవు మాటలయందు, పనులయందు మార్పులు సంభవింప జేసుకున్న నీ తలంపులు లోకులు యెరుగరు కానీ, లోకేశుడు యెరుగును.

**లోకుల కన్నులు కప్పగలవు గానీ**
**చిట్టావ్రాసే చిత్రగుప్తునికం**
**డ్లెట్టుల గంతలు గట్టుదురా**

అని, చిత్రంగా గుప్తమై వుంటున్నాడు, నీ చిత్తములో భగవంతుడు. లోకాన్ని వంచించవచ్చు, లోకానికి మరుగుపరచవచ్చు. లోకముయొక్క కన్నులకు గంతలు కట్టవచ్చు. కానీ, భగవంతుని కన్నులకు గంతలు కట్టటానికి వీలుకాదు. ఏనాటికైనాకూడను కర్మ ఫలము మనకు తప్పినది కాదు. కర్మఫల సిద్ధాంతమును మనము తప్పక విశ్వసించి తీరాలి. ఈ కర్మఫల సిద్ధాంతమును అంగీకరించినదే మన భారతదేశము. కనుకనే భాగవతమునందుకూడను

**కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననే వృద్ధిపొంది కర్మమున చనున్**
**కర్మమె నరునకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలోన్**

అని చెప్పబడింది. కరణం, కారణం, కర్మ యీ మూడింటియొక్క సమ్మిళితమే మానవునియొక్క జీవితము. కనుక, మానవుడు పవిత్రమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. పవిత్ర భావములు అభివృద్ధి పరచుకొనవలెనన్న సాత్త్వికాహారము అత్యవసరము. ఆహారము మితముగను, హితముగనుకూడా వుండాలి. సాత్త్వికాహారమనికూడను అధికముగా మనము భుజించరాదు. జీవితమంతయు కేవలము



srisathyasaivachanamrutam

లోకసంబంధమైన కర్మలయందే అంకితము గావించరాదు. జీవితము దీర్ఘప్రయాణము. ఈ దీర్ఘప్రయాణములో మనము చేరవలసిన గమ్యమునకు తగిన శక్తిని సంపాయించుకోవాలి. పవిత్రమైన ఆహారముచేతను, పవిత్రమైన భావములచేతను మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించుకోటానికి కొన్ని విధములైన నిషిద్ధ కర్మలు చెప్పబడినాయి. అనగా త్యజించివలసినవి కొన్ని వుంటున్నవి. ఒక భూమిని మనము దున్ని పంట పెట్టవలెనన్న అందులో పూర్వము వుండిన ముండ్ల చెట్లను, పనికి మాలిన పైరునంతా పెరికి వేయాలి. తదుపరే దానిని దున్ని దుక్కి చేసి మనము పెట్టవలసిన పంటకు తగిన విత్తనము నాటాలి. అప్పుడే ఆశించిన పంటను, ఫలమును మనము అందుకోగలము. అదే విధముగనే మనము త్యజించవలసిన భావములు త్యజించిన తరువాతనే, భజించవలసినదానికి అవసరమైన బీజములు మనము నాటుకోవచ్చును. కనుకనే మన నిత్య జీవితములోపల నిషిద్ధకర్మలను తప్పనిసరిగా త్యజించాలి.

నాల్గవది, కేవలము పాప పరిహారార్థమై గావించవలసిన కర్మలు. మనము తెలిసో తెలియకో ఎన్నో విధములైన దోషములు, పాపములు చేసి వుంటాము. వీటి పాప పరిహారార్థమై మనము గావించవలసిన కర్మలు కొన్ని వుంటున్నాయి. ఇందుకొరకు భారతీయ మహర్షులందరుకూడను తాము అనుభవించి, ఆచరించి, ఆనందించి లోకానికి అందించి పోయిన కొన్ని మార్గములున్నవి. అనేక సాధనలతోకూడను సాధించి, శోధించి మానవులకు అవసరమైన మార్గములను మహర్షులు బోధించారు. అవియే పవిత్రక్షేత్ర దర్శనములని, పవిత్ర నదీ స్నానములని, యిలా పాప పరిహారార్థమై కొన్ని ప్రక్రియలను నియమించుతూపోయారు. 'దర్శనం పాప నాశనమ్', 'సంభాషణమ్ సంకట నాశనమ్', 'స్పర్శనమ్ కర్మ విమోచనం' అనే మూడు మార్గములను పురస్కరించుకొని అప్పుడప్పుడు మనము మానసిక శాంతి నిమిత్తమై, మానసిక పవిత్రత నిమిత్తమై కొన్ని విధములైన యాత్రలుకూడను చెయ్యాలి. ఈ యాత్రలు యేవిధమైన భావముతో వుండాలంటే చిత్తశుద్ధితో, నిశ్చలభక్తితో, ఫలాపేక్ష రహితముగా యాత్రలు చెయ్యాలి. ఈ సందర్భంగా కొంతమంది మొక్కే మొక్కులుకూడను విచిత్రమైనవిగా వుంటాయి. 'ఓ వెంకటరమణస్వామీ! నా కార్యములన్నీ పూర్తయి, నా బిడ్డల పెండ్లి జరిగి, నా కొడుకులు

srisathyasaivahini / vachanamrutam

చక్కగా పరీక్షల్లో వుత్తీర్ణులైతే నేను వచ్చి నా కొడుకులచేత వారి తలవెంట్రుకలు అర్పిస్తాన'ని మొక్కు కుంటారు. ఇంకా యీనాడు యీ కలిప్రభావముచేత మరింత చిత్ర విచిత్రమైన మార్గాన్ని అవలంబిస్తున్నారు. పేపర్లో వస్తుండాది, పది లక్షల లాటరీ వుంటున్నాది. 'స్వామీ! ఆ పది లక్షలు నాకు వచ్చిందంటే నీకొక నూరురూపాయలు చెల్లిస్తాన'ంటారు. ఈ విధముగా మొక్కుకోవడంలో దైవాన్ని వారు యే విధముగా భావిస్తున్నారో మనము విచారించాలి. నీ నూరు రూపాయలకోసము భగవంతుడు అక్కడ కాచుకొని వుంటున్నాడా? సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అయిన భగవంతునికి నీవు యిచ్చే నూరురూపాయలు యెంతటిది? ఆ యొక్క వివేకాన్ని చింతించుకోలేకపోతున్నారు. 'భగవంతుడా! యీ పది లక్షలు నాకు వచ్చేటట్లు చేయి', అంటారు. చేసేది ఎవరు, భగవంతుడే? తానే పది లక్షలు మన కందిస్తుంటే మనం నూరురూపాయలు భగవంతునికి అందించటం యేమిటి? ఇది యెంత తెలివి తక్కువ!

**మీ హృదయాన్నే భగవంతునికి అర్పించాలి**

దేశకాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని కలిలో విచిత్రమైన బుద్ధులుకూడను అభివృద్ధి అవుతున్నాయి. భగవంతునికి తుచ్ఛమైన బొచ్చు యిచ్చి ఉత్తమమైనవి కోరటానికి ప్రయత్నిస్తున్నారు. ఇది కాదు, నిజమైన ప్రార్థన. ఇది కాదు, నిజమైన భక్తి. మీ దగ్గర విలువైనది ఒకటున్నది. ఆ విలువైన హృదయాన్ని భగవంతునికి అర్పించాలి. దీనినే మీరా చెప్పింది:

**ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు**
**మరలదానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమిడెత్తు నీ పాదార్చనకును**

"ఇంక నేను తెచ్చేది ఏమీలేదు. నీవిచ్చినదే నీకు అర్పిస్తున్నాను. ఇదికూడను నాది కాదు", అన్నది. ఇదే పరిపూర్ణమైన భక్తి. ఇచ్చినదెవరు? నీవే? నీది నీకే అర్పితము చేస్తున్నాను. కాని, ఈనాడు యింతటి వివేకము అందరికి కలగటంలేదు. గంగలో నిల్చుకుంటారు, గోదావరిలో నిల్చుకుంటారు. కృష్ణలో నిల్చుకుంటారు. 'కేశవాయ నమః', 'నారాయణాయ



srisathyasaivachanamrutam

నమః', 'మాధవాయ నమః' అంటూ గంగనీరు గంగకే అర్పితము చేస్తున్నారు. యేదో వీరి తాతగారి సొత్తు తెచ్చి అర్పితము చేస్తున్నట్టుగా భావిస్తున్నారు. 'నేను చేస్తున్నాను', అన్న భావమే పెద్ద చెడ్డ భావము. నీవు చేసేది యేమీ లేదు. నీవు నిర్మల చిత్తుడవై వుంటే చేయవలసినదంతా తానే చేస్తాడు. పసిబిడ్డను తల్లి తొట్టెలో పండ బెడుతుంది. అన్నిటికి తల్లిపై ఆధారపడిన యీ బిడ్డకు తల్లియే క్షణక్షణమునకు ఆ అవసరాన్ని బట్టి తానే అందిస్తూ సేవ చేస్తూ వుంటుంది. అనగా శరణాగతుడైన సాధకునకు సర్వముకూడను భగవంతుడే చూచుకుంటాడు. అయితే, అందరికి యిట్టి పవిత్రమైన ఉన్నతస్థాయి లభించటములేదు. ఇది చేతకాదనికూడను మనము నిరుత్సాహము, నిస్పృహకు గురికాకూడదు. మన ప్రయత్నము మనము చేయాలి. మన ప్రయత్నమును పురస్కరించుకొనియే భగవంతుని అనుగ్రహముకూడను చేరుతుండాది. కనుకనే మనము చేయవలసినవి సక్రమమైన మార్గములో, సరైన చిత్తముతో ఆచరించటానికి ప్రయత్నించాలి. శాస్త్రములు, వేదములు, యితిహాసములు, ఉపనిషత్తులు యివన్నియు మానవుని గమ్యము చేర్చటానికి ఒక విధమైన సోపానములే! సర్వవేదముల సారము, సర్వఉపనిషత్తుల సారము, సర్వ వేదాంతములయొక్క గమ్యము దైవము ఒక్కడే! మార్గములు వేరు వేరు. మార్గములు వేరని, భగవంతుడు వేరని భావించుకొనటము వెఱ్ఱితనము. కనుక, మనము గమ్యాన్ని లక్ష్యమునందుంచుకొని ధన్యులు కావటానికి తగిన కృషిని చెయ్యాలి. మనము ఎన్నోరకములైన పుష్పములతో పూజ చేస్తున్నాము. కొంతమంది గులాబి పుష్పములే తెచ్చి పూజచేయాలనుకుంటారు. మరికొంతమంది తామర పుష్పములే అర్పించాలని ఆశిస్తుంటారు.

**శృంగారములు వేరు బంగారమొక్కటే**
**పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే**
**జీవ జంతువులు వేరు జీవుండు ఒక్కడే**
**జాతి నీతులు వేరు జన్మమొక్కటే**
**దర్శనంబులు వేరు దైవమొక్కడే**
**పూల జాతులు వేరు పూజ ఒక్కటే**

అనేకత్వములో వున్న యేకత్వాన్ని దర్శింపజేసేదే ఆత్మజ్ఞానము. దీనిని పురస్కరించుకొనియే 'ఈశావాస్య మిదమ్ సర్వమ్' 'ఈశ్వర స్సర్వ భూతానామ్' 'ఏకోవసి సర్వ భూతాంతరాత్మ' అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. అందరియందు వుండిన దైవము ఒక్కడే అని గుర్తించుకున్నప్పుడు యిందులో వుండిన ఏకత్వాన్ని మనము ఎందుకు ఆచరణలో పెట్టటంలేదు? ఏకత్వాన్ని మనము బోధిస్తున్నాము, ఉచ్చరిస్తున్నాము. కానీ, భిన్నత్వాన్ని అనుభవిస్తున్నాము.

కొంతమంది దైవానికి ద్రోహము చేయటానికి ప్రయత్నము చేస్తూవుంటారు. వారు దైవానికి ద్రోహము చేస్తున్నామని అనుకుంటున్నారు కాని, ఇది చాలా పొరపాటు. దైవానికి ఎవరుకూడను ద్రోహము చేయలేరు. యిది తనను తాను వంచన చేసుకోటమేగాని దైవాన్ని వంచన చేయటం యేమాత్రము కుదరదు. మంచి చేసినా, చెడ్డ చేసినా తనకు తాను చేసుకోటమే! యిట్టి సత్యాన్ని గుర్తించి మానవుడు సమస్త జీవులయొక్క ఆనందమును, సమస్త జీవులయొక్క శాంతి సంతోషములను ఆశించటానికి తగిన కృషి చేయాలి.

**దైవమును ప్రసన్నం చేసుకున్నప్పుడు జగత్తంతా ప్రసన్నంగా ఉంటుంది**

లోకశాంతి నిమిత్తమై యజ్ఞయాగాదులు జరుగుతున్నాయి. అనగాయేమి? దైవమును ప్రసన్నుని గావించుకొన్నప్పుడు జగత్తంతా ప్రసన్నతగా వుంటుంది. కనుక దైవాన్ని ప్రసన్నుని గావించుకొనే మార్గమే యీ యజ్ఞయాగాదిక్రతువులు. దీనియందు మరియొక అంతరార్థముకూడా వుంటున్నది. ఈ జగత్తునకు సర్వము అనుగ్రహించినవాడు, భగవంతుడు. తాను అనుగ్రహించినది తనకు అర్పితము చేయటమే సాధకుని ప్రధాన కర్తవ్యము. ఆ అర్పితము చేయటములోపల కేవలము తనయొక్క ఆనందము నిమిత్తము అర్పితము చేయటమేగాని తాను యిందులో త్యాగము చేసినట్టుకాదు. లౌకిక దృష్టిలో మాత్రము మనము యేదో భగవంతునికి అర్పితము చేసినట్టుగా భావిస్తుంటాము. అప్పుడే మనకు శాంతి సంతోషములు లభిస్తున్నాయని భావిస్తున్నాము. దీనిని పురస్కరిచుకొనియే వేదమునందు 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః' అని చెప్పబడింది. త్యాగముచేత అమృతత్వము మనకు లభిస్తున్నాదని చెప్పటములోపల

sri sathyasai vachanamrutam

అంతరార్థము ఏమిటి? దేనిని త్యాగము చేయాలి? వ్యక్తిత్వాన్ని త్యాగము చేయాలి. సమిష్ఠితత్వాన్ని అభివృద్ధిపరచాలి. సమాజములో మనము ప్రవేశించాలి. సమాజములోనున్న సర్వేశ్వరుని మనము సేవించాలి. ఎందుకనగా సువిశాల జ్ఞానతత్త్వాన్ని చూడలేని మానవుడు, జీవిత అంతరాంతరాలలో ప్రవేశించలేని మానవుడు విశ్వశాంతిని యేరీతిగా సాధించగలడు? విశ్వశాంతి, సమాజ శాంతిపై ఆధారపడి వున్నది. వ్యక్తి శాంతిగా వుండినప్పుడే సమాజమును శాంతి రూపములో తీర్చిదిద్దవచ్చు. సమాజము శాంతి భద్రతలతో వుండినప్పుడే దేశమంతా శాంతి భద్రతలతో నిండి వుంటుంది. కనుక వ్యక్తి, సమాజము, విశ్వము యీ మూడుకూడను త్రిమూర్త్యాత్మక స్వరూపములు. ఇవి అన్యోన్య ఆశ్రయములు, అవినాభావ సంబంధములు. కనుక మొట్టమొదట వ్యక్తియొక్క ఆనందాన్ని అభివృద్ధి పరచుకోవాలి. తరువాత ఈ ఆనందాన్ని సమాజములో నింపాలి. సమాజములో నిండిన ఆనందమును లోకమంతా వ్యాపింప జేయాలి. మీ శాంతి సంతోషములంతాకూడను కేవలము స్వార్థపరంగా ఉండకూడదు. కేవలము తైలముపైన వేసిన నీటిబొట్టువలెకాని, లేక నీటిపైన పెట్టిన తైలపుబొట్టువలెకాని మీ జీవితము యేకాకి జీవితముగా ఉండకూడదు. ఎవరిని ద్వేషించకూడదు. ఇదే భగవద్గీతయొక్క సారాంశము. 'అద్వేష్టా సర్వభూతానామ్'. ఎవరిని ద్వేషించిననూ నిన్ను నువ్వు ద్వేషించుకున్నవాడవే! నా తల్లి, నా తండ్రి, నా అక్క, నా చెల్లెలు, నా పుత్రులు, నా భార్య అని యింత మాత్రమే ఒక సంకుచితమైన కుటుంబముగా నీవు భావించరాదు. విశ్వకుటుంబముగా నీవు భావించాలి. హృదయాన్ని విశాలముగా నీవు చేసుకోవాలి. అప్పుడే, ఆ విశాల హృదయమునందే దైవము నివసించటానికి వీలవుతుంది. ఇలాంటి విశాల భావములు పెంచుకొనే నిమిత్తమై యజ్ఞ యాగాదిక్రతువులద్వారా త్యాగ భావమును వ్యక్తము గావించుకొనే మార్గమును బోధిస్తూవచ్చాయి.

**దేహమే ఒక యంత్రము, శ్వాసయే ఒక మంత్రము, హృదయమే తంత్రము**

ఆనాటి మహర్షులు చెప్పిన మాటలే మంత్రములుగా మారిపోయినాయి. మంత్రములు వేరు, మాటలు వేరు కాదు. పవిత్రమైన హృదయమునుండి ఆవిర్భవించిన ప్రతి

sri sathyasai vahini vachanamrutam

శబ్దముకూడను మంత్రస్వరూపకముగా రూపొందింది. తాము పెట్టిన ప్రతిపాదముకూడను ఒక పుణ్యక్షేత్రముగా రూపొందింది. చూచిన చూపులన్నీకూడను పవిత్రమైన దృష్టిగా మారిపోయాయి. సర్వత్ర వారు 'శివం' అనగా మంగళకరముగా చూస్తూవచ్చారు. సర్వమును సుందరముగా భావిస్తూ వచ్చారు. కనుకనే 'సత్యంశివంసుందరం' అనే స్వరూపమును ఆ మహర్షులు పొందినారు. మానవ జీవితమే సత్యంశివంసుందరం. ఆత్మ సత్యం, హృదయం శివం, మన భావము సుందరం. కనుక సత్యంశివంసుందరం అంతా మన హృదయమునందే వుంటున్నాది. దీనినే యంత్రం, మంత్రం, తంత్రం అన్నారు. మన దేహమే ఒక యంత్రము. మన శ్వాసయే ఒక మంత్రము. మన హృదయమే తంత్రము. ఈ శ్వాస ప్రక్రియ ఏ విధముగా జరుగుచున్నదో యోచించండి. సో......హం; యిది మంత్రముకదా! అనగా మన ఉచ్ఛ్వాస నిశ్వాసములే ఈ మంత్రరూపముగా మారాయి. ఈనాడు మనం ఎవరో ఒక గురువు దగ్గరకు వెళ్లి వారిని ప్రార్థించి, వారిని ఆశ్రయించి, ఒక మంత్రాన్ని వారిద్వారా ఉపదేశం పొందినట్లు భావిస్తున్నాము. కాదు. కాదు. నిత్యజీవితములోపల మనదేహములోని అంతర్యామియే క్షణక్షణమునకు 'సోహం', 'సోహం', అనగా 'నీవే దైవము, నీవే దైవము' అని దినమునకు 21,600 పర్యాయములు బోధిస్తుంటే దీనిని నీవు లక్ష్యము చేసుకోటంలేదు. ఏదో గురువు దగ్గరకు పోయి వారి చేతిలో కాసులు పోసి, వారు నీ చెవిలో మంత్రము చెప్పేస్తే అది పెద్దగ భావించి దానిని ఆశ్రయిస్తూ వస్తున్నావు. ఇది చాలా పొరపాటు. ఈ యిమిటేషన్లు మనకు వుండకూడదు. మన హృదయములో ఆవిర్భవించిన ఆత్మతత్త్వాన్ని మనము అనుసరించాలి. 'మర్మమెరిగిన మరునిమిషంబున మనసే వారికి గురువండి!' అంతకంటే పెద్ద గురువులేడు. కనుక, సమస్త శాస్త్రములు దైవత్వాన్ని నీ హృదయములో ప్రతిష్ఠించుకోమని బోధించాయి. కర్మకాండయందుండిన ఈ రహస్యము తిరిగి జ్ఞానమార్గమువరకు యేవిధముగా ప్రయాణమవుతుందనే విషయాన్ని మనము వచ్చే యేడు దినములలో పూర్తిగా తెలుసుకోగలుగతాము. కనుక, కాలమును వ్యర్థము చేయక, కాయమును నిరుపయోగ పరచక, కర్తవ్యమును నిర్వర్తించి జన్మను సార్థకము చేసుకోండి. **(తేదీ 6-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivahini.org